ఈనాడు
కాకినాడ
సోమవారం అక్టోబరు 7, 2024


# 723 పాఠశాలలు.. పదిమందిలోపే పిల్లలు!



ఉమ్మడి జిల్లాలో

24 పాఠశాలల్లో అసలు విద్యార్థులే లేరు.

126 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ లేరు.



పాలకోడు ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే విద్యార్థి

న్యూస్‌టుడే, పామర్రు

1.. 2.. 3.. 4.. 10.. ఇవన్నీ ఏదో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన ర్యాంకులనుకునేరు..! కాదండి బాబు.. ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య. కొన్నిచోట్ల అసలు బాలలే లేరు. పిల్లలతో కళకళలాడాల్సిన పాఠశాలలు గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయి. వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రాథమిక విద్య కోలుకోలేనంతగా విధ్వంసానికి గురయ్యింది.

వైకాపా హయాంలో జీవో 117ను అమలు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ఆ ప్రభావం ప్రాథమిక బడులపై పడింది.

**ఇదీ పరిస్థితి**

| | |
|---|---|
| ఉమ్మడి జిల్లాలో మొత్తం పాఠశాలలు | 3,812 |
| ప్రాథమిక స్కూళ్లు | 2,920 |
| వీటిలో చదువుతున్న విద్యార్థులు (సుమారు) | 1.25 లక్షల మంది |
| విలీనం చేసిన ప్రాథమిక పాఠశాలలు | 368 |

## నష్టం జరిగిందిలా..

సాధారణంగా పిల్లలను ఒక పాఠశాలలో చేర్పిస్తే ప్రాథమిక విద్య అంతా అక్కడే కొనసాగించడం నిత తల్లిదండ్రులు ఇష్టపడుతుంటారు. విలీనం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే ఉండడంతో ఆ రెండేళ్లు మాత్రమే అక్కడ చదివించడం ఎందుకని? అయిదు తరగతులున్న బడిలో చేర్పించాలని భావిస్తున్నారు. మరోవైపు 3, 4, 5 తరగతులు చదివేందుకు బడులు కూడా కొంత దూరాభారంగా మారడంతో పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడానికే మక్కువ చూపారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పడిపోయాయి. సున్నా స్కూళ్లు పెరిగిపోయాయి.

**వైకాపా నిర్ణయంతో కళతప్పిన బడులు**

**లోకేశ్ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు**

ఉపాధ్యాయ సంఘాల నేతలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల చర్చించారు. జీవో నంబరు 117 రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని అంతా విన్నవించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విలీనం నిలిపేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ప్రాథమిక పాఠశాలలు పూర్వ వైభవం వస్తుందని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

**విద్యార్థులే లేని బడులు**

కోనసీమ జిల్లా: సఖినేటిపల్లి మండలం సూర్యనారాయణ పేట, సఖినేటిపల్లి లంక, మలికిపురం మండలం బాడవ

కాకినాడ జిల్లా: తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్, పెద పూడి మండలం ముక్కేశ్వరం

తూర్పుగోదావరి జిల్లా: చాగల్లు మండలం మల్లవరం, ఎంపీపీఎస్(మెయిన్)

## నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**డయల్ యువర్ కమిషనర్**

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, అనంతరం వినతుల స్వీకరణ ఉంటుందని కమిషనర్ భావన తెలిపారు.

## కరుణచూపలేదు కన్నా..

తల్లి పేగు తెంచుకు పుట్టిన కనుపాప ఏమైందో ఏమో..

ముళ్లపొదల్లో మరణశాసనం రాశారు..

ఆ బిడ్డ మృతి మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది.



కళ్లు తెరవకుండానే, అమ్మపొత్తిళ్లు చేరకుండానే..

నూరేళ్లు నిండుతున్న పసికందుల ఆత్మఘోషకు అంతమెప్పుడు..?

## కత్తి దూశాడు ఓ అన్న

పేగు పంచుకు పుట్టినవాడే పగబట్టాడు..

కత్తిదూసి తమ్ముడినే కడతేర్చాడు..

చిన్నప్పుడు దారిచూపిన చెయ్యే పెద్దయ్యాక

ఆస్తి మైకంలో కత్తి దూసింది..



అన్నదమ్ముల సవాళ్లతో..

బంధాలు బలిపీఠమెక్కుతుంటే..

అంధకారం అలముకుంటుంటే..

అనుబంధాలకు ఆస్కారమేదీ..?

-వివరాలు 10లో

## సీబీఐకి చిక్కిన కస్టమ్స్ అధికారులు

- రూ.3.18 లక్షలు లంచంతో పట్టుబడిన సూపరింటెండెంట్
- ఏసీ, ఇతర అధికారుల నుంచి రూ. 27.74 లక్షలు స్వాధీనం

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ పోర్టులోని కస్టమ్స్ కార్యాలయంతోపాటు అధికారుల నివాసాలపై శనివారం సీబీఐ అధికారులు దాడులు నిర్వహించారు. పలువురు అధికారుల నుంచి మొత్తం సుమారు రూ.31 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకుంటున్నారన్న ముందస్తు సమాచారం మేరకు నిఘావేసిన అధికారులు కాకినాడ పోర్టు కస్టమ్స్ సూపరింటెండెంట్ వై.శ్రీనివాస్ వద్ద నుంచి రూ. 3,18,200 స్వాధీనం చేసుకున్నారు. లంచం ఇచ్చిన కాకినాడకు చెందిన శ్రీ చంద్ర బల్క్ కార్గో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పంతం భరత్‌కుమార్‌నూ అరెస్టు చేశారు. విచారణ క్రమంలో నిందితుల సమాచారం ఆధారంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి రూ.22.74 లక్షలు, మరికొందరు కస్టమ్స్ అధికారుల నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అసిస్టెంట్ కమిషనర్, ఇతర కస్టమ్స్ అధికారులు వేరే చోటుకు ప్రయాణానికి సిద్ధమవుతుండగా దాడులు చేసి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ పేర్కొంది. వీరి పేర్లు మాత్రం వెల్లడించలేదు. ఈ కేసులో కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను విశాఖపట్నం సీబీఐ న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ఆదివారం హాజరు పరచగా రిమాండ్ విధించారు. విశాఖపట్నం సీబీఐ యూనిట్‌లోని అవినీతి నిరోధక విభాగం బృందాలుగా ఈ సోదాల్లో పాల్గొంది. అనుమానితుల ఇళ్లలో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి, దస్త్రాలు స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

## టమాటా @100



ఉమ్మడి జిల్లాలో సాగు తీరిదీ.. (ఎకరాల్లో)

| కాకినాడ | తూర్పు గోదావరి | అంబేడ్కర్ కోనసీమ |
|---|---|---|
| 692 | 283 | 200 |

ఈనాడు, కాకినాడ


టమాటా ధర దారెత్తిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. ఒక ట్రెండు రోజుల్లో ధర మరింత పెరగవచ్చనే వాదన వినిపిస్తోంది. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడమే ఈ పరిస్థితి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రైతు బజార్లలో ధరలకు.. రిటైల్ మార్కెట్ ధరలకూ భారీ వ్యత్యాసం ఉండడంపై చర్చనడుస్తోంది. జిల్లా కేంద్రం కాకినాడలోని రైతు బజారులో కేజీ టమాటా ధర రూ.40కి విక్రయిస్తుంటే.. బయట మార్కెట్లో, వీధుల్లో విక్రయించేవారు కేజీ రూ.100కు అమ్మారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో కేజీ రూ.100కు అమ్ముతున్నారు. ధరలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ భారీ వ్యత్యాసానికి కారణమనే వాదన వినిపిస్తోంది. వర్షాల కారణంగా మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గిందని ఎస్టేట్ అధికారులు పేర్కొంటున్నారు.



రైతుబజారులో రాయితీ టమాట విక్రయాలు

**పొరుగు పంటతో పేచీ..**

ఉమ్మడి జిల్లాలో పండిస్తున్న టమాటా తక్కువే. ఇక్కడ పండిన పంట జనవరి, ఫిబ్రవరి, మార్చి అవసరాలకు సరిపోతుండడంతో మిగిలిన నెలల్లో మదనపల్లి, పలమనేరు, కలికిరి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. పలమనేరు మార్కెట్‌లో 15 కేజీల టమాటా పెట్టె ధర రూ.850 పలుకుతుంటే.. రవాణా, కూలీ ఖర్చులు, తరుగు అన్నీ పోను ఇక్కడికి వచ్చేసరికి రెట్టింపు ధరకు అమ్ముతున్నారు.




## మరణంలోనూ 'సమాచార' వేదన..!

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

మరణ ధ్రువీకరణ పత్రం.. మృతిచెందిన వ్యక్తి ఆర్థిక లావాదేవీల విషయంలో, కుటుంబ సభ్యులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందడానికి ఇది అత్యవసరం. దీన్ని బాధిత కుటుంబీకులకు అందించడంలో కాకినాడ నగరపాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నా.. డెత్ సర్టిఫికెట్‌కు ముందు నమోదు చేసే 'మరణ సమాచారం' విషయంలో బాధిత కుటుంబ సభ్యులను కాళ్లు అరిగేలా తిప్పుతున్నారు.

కాకినాడలోని ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో విజ్జపురెడ్డి హిందూ శ్మశాన వాటికలో ది.కాకినాడ రోటరీ బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ అండ్ మెయింటెనెన్స్ ట్రస్టు ద్వారా దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నగరపాలక సంస్థ మరణ సమాచారం నమోదు కేంద్రం ఏర్పాటు చేసింది. దహన సంస్కారాలు జరిగిన వ్యక్తి వివరాలను ఇక్కడ నమోదు చేస్తారు. వీరిచ్చే మరణ సమచార పత్రం ఆధారంగా నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.

**ఇదీ పరిస్థితి..**

మరణ సమాచారం నమోదుకు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. దహన సంస్కారాలు పూర్తయ్యే సరికి మరణ సమాచార పత్రం సిద్ధం చేయాలి. ఇక్కడే తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నమోదు ప్రక్రియ 2022, ఏప్రిల్ వరకు సక్రమంగా జరిగింది. అప్పటి మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి స్వప్నిల్ దీనిపై ప్రత్యేక దృష్టిసారించి, తనిఖీ చేయించేవారు. తరువాత పరిస్థితి మారిపోయింది. దహన సంస్కారాలు పూర్తయి మూడు, నాలుగు రోజులకు గానీ మరణ సమాచార పత్రం ఇవ్వడం లేదు.



విజ్జపురెడ్డి శ్మశాన వాటికలో మరణ సమాచారం నమోదు కేంద్రం

**సిబ్బంది ఒకరు.. పనిచేసేది మరొకరు**

ఈ శ్మశాన వాటిక 3వ శానిటేషన్ సర్కిల్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ మరణ సమాచారం నమోదుకు ఒక శానిటరీ వర్కర్‌ను నియమించారు. ఆమె స్థానంలో రెండేళ్లుగా మరొకరు పని చేస్తున్నారు. సదరు వ్యక్తి విధులకు సక్రమంగా రాకపోవడంతో ఈ పత్రాలు సకాలంలో అందడం లేదు. దీన్ని స్థానిక హెల్త్ అసిస్టెంట్ పర్యవేక్షించాలి. ఈ అధికారి ఎక్కడా కనిపించరు. ఈ సమాచారం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

మరణ సమాచారం వెంటనే నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సంబంధిత పత్రం అందజేయాలి. పరిస్థితిపై విచారణ చేస్తాం. దహన సంస్కారాలు పూర్తయిన వెంటనే మరణ సమాచార పత్రం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తాం.

**- సుదర్శనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

## వారాహి శక్తితో అభయం

సర్పవరం జంక్షన్: వారాహి అమ్మవారి శక్తితో భక్తులకు అభయం లభిస్తుందని, అపాయాలను ఎదిరించే ధైర్యం ప్రసాదిస్తుందని శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక భక్తులకు వారాహి అమ్మవారిగా దర్శనమిచ్చారు. శ్రీమహాశక్తియాగం నాలుగో రోజు పూజల్లో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. పీఠాధిపతి ఆధ్వర్యంలో గోశాల ప్రాంగణంలో కుంకుమార్చనలు నిర్వహించారు. చిన్నారి హర్షదేవ్ స్వామీజీ సమక్షంలో లలితాసహస్ర నామాలు ఆలపించాడు. సుమారు 30 వేలమంది భక్తులతో మూడుసార్లు పారాయణం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుమారు 50 వేలమందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వారాహిదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక

## సంఘాల పేరుతో స్వాహా

**అక్రమార్కులపై చర్యలకు సిద్ధం**

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని బోగస్ డ్వాక్రా సంఘాల ఏరివేతకు రంగం సిద్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందిన గ్రూపులను గుర్తించారు. కొందరు యానిమేటర్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు(సీసీ), బ్యాంకు అధికారులు కుమ్మక్కై అర్హతలేని గ్రూపులకు రూ.కోట్లలో రుణాలు ఇప్పించారు. తాజా తనిఖీల్లో ఇవన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బోగస్ సంఘాలు సృష్టించి అక్రమంగా బ్యాంకు రుణాలు పొందిన వ్యక్తులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు.

**రుణాలు చెల్లించని గ్రూపుల పేరుతో..**

కొందరు యానిమేటర్లు, సీసీలు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై డీఫాల్ట్ (సకాలంలో చెల్లించనవి) డ్వాక్రా గ్రూపులను నిబంధనలకు విరుద్ధంగా పునరుద్ధరించారు. వాటి సీనియారిటీ ఆధారంగా చేసుకుని, ఆ సంఘాల సభ్యుల పేర్లతో రుణాలు పొందారు. ప్రతి మండలంలో ఇలాంటి సంఘాలు నాలుగైదు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. పక్షం రోజులుగా క్షేత్రస్థాయిలోని డీఆర్‌డీఏ సిబ్బంది, బ్యాంకు అధికారులు సరిపోల్చారు. నివేదికలను డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో సమర్పించారు. పూర్తిస్థాయి విచారణ బాధ్యతలను ఏడుగురు డీపీఎంలకు అప్పగించారు. శుక్రవారం నుంచి పీడీ కార్యాలయంలో తనిఖీలకు ఏపీఎంలు, సీసీలు హాజరయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పులు తీసుకున్న గ్రూపులను గుర్తించి విచారిస్తున్నారు. తుది ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు.



రికార్డులు తనిఖీచేస్తున్న ఏపీడీ వెంకటేశ్వరరావు

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

| | |
|---|---|
| మండలాలు | 20 |
| మహిళా సమాఖ్యలు | 20 |
| గ్రామైక్య సంఘాలు | 1,125 |
| డ్వాక్రా సంఘాలు | 39,532 |
| డ్వాక్రా సభ్యులు | 4,08,410 |
| ఏటా రుణాలు (రూ.కోట్లలో) | 1,200 |

**క్రిమినల్ కేసులు పెట్టాం..**

సెర్ప్ సీఈవో ఆదేశాలతో పిఠాపురం మండలంలోని రెండు గ్రామాలకు సంబంధించి యానిమేటరు, సీసీ, బ్యాంకు మేనేజరుపై పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిమినల్ కేసులు పెట్టారు. అన్ని డ్వాక్రా సంఘాల బ్యాంకు లావాదేవీలపై విచారణ పూర్తయ్యింది. డీపీఎంలతో మళ్లీ తనిఖీ చేయిస్తున్నాం. అక్కడక్కడ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఎవరినీ ఉపేక్షించం.

**- కె.శ్రీరమణి, డీఆర్‌డీఏ పీడీ (ఎఫ్ఏసీ), కాకినాడ**



## భక్తులకు కొత్త బస్సులు

అన్నవరం: భక్తుల సౌకర్యార్థం అన్నవరం దేవస్థానం రెండు కొత్త బస్సులు అందుబాటులోకి తెస్తోంది. సుమారు రూ.80 లక్షల వ్యయంతో(చాసిస్, బాడీ కలిపి) వీటిని తయారు చేయించింది. 40 సీట్ల సామర్థ్యం ఉన్న రెండు బస్సుల చాసిస్‌కు బాడీ తయారీ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు. భక్తుల రాకపోకలకు ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదు. దీంతో అదనపు బస్సులను సిద్ధం చేశారు.

## డొక్కా సీతమ్మ సేవలు ప్రపంచానికి ఆదర్శం

గాంధీనగర్: ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టి అన్నపూర్ణగా, అన్నదాతగా డొక్కా సీతమ్మ అందించిన సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ చెప్పారు. ఆదివారం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని ప్రాంగణంలో ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ జయంతి వేడుకలను ఫిలాంత్రఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా ఆధ్వర్యంలో వర్ణధార హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నందిక మహాలక్ష్మీకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ సీతమ్మ లాంటి అన్నపూర్ణమ్మ మళ్లీ జన్మించరని చెప్పారు. ఆమె సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టడం ద్వారా ఆమెకు తగిన గౌరవం కల్పించారన్నారు. డొక్కా సీతమ్మ కుటుంబంలోని అయిదోతరం వారసుడు డొక్కా భీమవెంకట సత్య కామేశ్వరరావు మాట్లాడుతూ సీతమ్మ వారసుడిగా గర్వపడుతున్నానని చెప్పారు. ఏపీఎస్‌పీఎఫ్ కమాండర్ కొండా నరసింహారావు, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నార్తుల ఆకలి తీర్చిన సీతమ్మ ఆణిముత్యమన్నారు. కార్యక్రమంలో సీతమ్మ కుటుంబ సభ్యుడు కామేశ్వరరావు దంపతులను సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రముఖులైన 20 మందికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాలు అందించారు. ఈవీ కృష్ణమాచార్యులు, బడే గోవిందరావు, కె.ప్రభాకర్, మాణిక్ రెడ్డి, సుజాత, తలారి ఆనంద్, కె.కోటి తదితరులు పాల్గొన్నారు.



కామేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

## ప్రమాదపుటంచున.. రైల్వే పైవంతెన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన కాకినాడ, రాజమహేంద్రవరంతో పాటు ముఖ్య పట్టణాలైన సామర్లకోట, పెద్దాపురం రాకపోకలకు అత్యంత ముఖ్యమైన సామర్లకోట రైల్వే పైవంతెన దుస్థితిలో చిక్కుకుంది. రైల్వేశాఖ పరంగా ఎంతో ముఖ్యమైన ఈ వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. వంతెన రక్షణగోడలు శిథిలావస్థకు చేరుకొన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితిలో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు వారధిపై పలుచోట్ల రావి, ఇతర పిచ్చిచెట్లు మొలిచి వంతెన గోడలను చీల్చుతూ బలహీనపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వంతెన రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- ఈనాడు, కాకినాడ**



రక్షణగోడ ధ్వంసం కావడంతో తాత్కాలికంగా కట్టిన ప్లాస్టిక్ రిబ్బన్లు



కూలిపోయి ప్రమాదకరంగా మారిన రక్షణగోడ

## రాత్రి గస్తీ పెంపు

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీని ముమ్మరం చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాత్రి విధులకు ప్రత్యేకంగా సిబ్బంది, వాహనాలు కేటాయించామన్నారు. పండగ నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారంతా పోలీసు శాఖ అందిస్తున్న ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్) సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సేవలు కావాల్సినవారు కాకినాడ పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 112కు ఫోన్ చేయాలని సూచించారు. దసరా సెలవులు, ప్రయాణాలు ప్రారంభమైన సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్, బీట్లను పెంచామన్నారు. నగరంలో ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా ఒక ఎస్సై, రాత్రి గస్తీ, పెట్రోలింగ్ విధులకు వాహనంతో సిద్ధంగా ఉంటారని వివరించారు.



గస్తీ సిబ్బందికి సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

## అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కూటమి జయకేతనం

పిఠాపురం: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన 'ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ఛైర్మన్ పదవి కైవసం కానుండడంతో నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరిగింది. 2011 మందికి గాను 981 మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల అధికారి పి.దుర్గాప్రసాద్ విజేతలను ప్రకటించారు. ఒకటో వార్డునుంచి స్వతంత్ర అభ్యర్థి బాలిపల్లి రాంబాబు 51 ఓట్లు, కూటమి బలపరిచిన 2వ వార్డు చెల్లుబోయిన ప్రమీల 41 ఓట్లు, అద్దంకి వెంకటరమణ 101, అరిగెల ప్రసాద్ 156, మేళం రామకృష్ణ 104 ఓట్ల మెజార్టీతో గెలిచినట్లు ప్రకటించారు.



సంబరాల్లో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మల బాబు

జనసేన సంబరాలు..: అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో విజయం సాధించిన వారిని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో తమ అభ్యర్థులను గెలిపించిన ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఈ విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అంకితం ఇస్తున్నామన్నారు. ఒకటో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన బాలిపల్లి రాంబాబు జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులను కలవడం చర్చనీయాంశంగా మారింది.






గొల్లప్రోలు: తాటిపర్తిలో కూష్మాండదేవి


పెద్దాపురంలో పండ్లతో అలంకరణ


పెద్దాపురప్పాడులో లలితాదేవిగా..

## అమ్మా.. శాంభవి

దసరా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు ఆలయాలకు పెద్దఎత్తున తరలివెళ్లి పూజల్లో పాల్గొన్నారు. సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పెద్దాపురం, పిఠాపురం, తుని గ్రామీణం, కరప


పిఠాపురం: గాజులతో దుర్గామల్లేశ్వరి


లలితా బాలాత్రిపురసుందరి అలంకరణలో దర్శనమిచ్చిన లోవ తలుపులమ్మ


హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ రవికి స్వాగతం పలుకుతున్న అధికారులు

## తలుపులమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

**తుని గ్రామీణం:** తలుపులమ్మ అమ్మవారిని ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ రవి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు.

## నేటి నుంచి తపాలా వారోత్సవాలు

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** కాకినాడ తపాలా డివిజన్‌లో సోమవారం నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన తపాలా పార్శల్ సేవల్లో వచ్చిన మార్పులు, విదేశాలకు పంపే ఏర్పాట్లు, మరింత మెరుగైన బట్వాడాకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. 8న ఫిలాటెలీ దినోత్సవం సందర్భంగా డాక్ అఖర్ ఉత్తరాల పోటీ, క్విజ్ నిర్వహిస్తామని, 9న మాతృమూర్తి పేరిట ఒక మొక్క అంశంపై మొక్కలు నాటుతామని వివరించారు. 10వ తేదీన రాజవొమ్మంగి, పిఠాపురం, జి.మామిడాడ, సామర్లకోట కార్యాలయాల్లో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 11న సామాన్యులను ఆర్థిక చేరికలో భాగం చేయడానికి పొదుపు, తపాలా జీవిత బీమా పథకాలు, ఐపీపీబీ సేవలపై అవగాహన కల్పించి కొత్త ఖాతాలు ప్రారంభించే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

## అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ విశాఖ


బహుమతులు అందుకున్న క్రీడాకారిణులతో నిర్వాహకులు

**శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. ఇక వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేషు (విశాఖ), ఎస్కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలను సంఘ సభ్యులు ఎన్.శివకుమార్ తదితరులు అభినందించారు.

## జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలి




అండర్-17 విభాగంలో విజేతలు, ముఖ్యఅతిథులు

**రాజానగరం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు మరింత నైపుణ్యం, ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని హెక్సావేర్ వైస్ ప్రెసిడెంట్ వినోద్ వర్మ ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. మరో ముఖ్యఅతిథి, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ విజేతలు ఈ నెల 21న హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై.వెంకట్, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు ఎస్.గంగాధర్, పరిశీలకుడు పి.కిశోర్‌బాబు, ప్రిన్సిపల్ విమల, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

● ఆధార్ తరహాలో జారీ ● వ్యవసాయ శాఖ సన్నాహాలు




**న్యూస్‌టుడే, కాకినాడ నగరం**

రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఒక యూనిక్ కోడ్ (యూసీ)ని కేటాయించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఆధార్ తరహాలోనే ఈ గుర్తింపు సంఖ్య ఉంటుంది. కేంద్రం చేపట్టిన ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా రైతుల వివరాల నమోదుకు వ్యవసాయ శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 6 లక్షల మందికిపైగా రైతులకు కార్డులందించాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగం డిజిటలైజేషన్ లక్ష్యంతో రైతులకు ఇవ్వాలనుకున్న ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య జారీకి ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది రైతులకు జారీచేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. రైతుల రిజిస్ట్రీ రూపొందించాక ఆధార్ తరహా ఐడీ కార్డులు అందిస్తారు. అక్టోబరు నుంచే కార్డుల జారీకి ఏర్పాట్లు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ అధికారులు కార్యాచరణ రూపొందించారు.

**ఇవీ లెక్కలు..**

| జిల్లా | రైతులు(లక్షల్లో) | కౌలుదారులు |
|---|---|---|
| తూర్పుగోదావరి | 2.82 | 1.45 |
| అంబేడ్కర్ కోనసీమ | 2.62 | 2.20 |
| కాకినాడ | 2.20 | 1.76 |

**బహుళ ప్రయోజనాలు..**

రైతులకు యూనిక్ కోడ్ జారీతో బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అన్ని పథకాలకు ఈ యూనిక్ కోడ్‌ని తప్పనిసరి చేయనున్నారు. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు, మార్కెట్లలో సులువుగా విక్రయించుకునేందుకు ఈ సంఖ్య ఉపయోగపడనుంది. ఈ నంబరు సాయంతో కిసాన్ క్రెడిట్ కార్డును కూడా ఉపయోగించుకోవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా ఈ సంఖ్య సాయంతో రుణ అర్హత వివరాలు, బకాయిలు వివరాలు, ప్రభుత్వ పథకాల జమ, తదితర వివరాలను వెంటనే తెలుసుకోవచ్చు.

**అన్ని విధాలా మేలే..**

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీతో అన్ని విధాలా మేలే జరుగుతుంది. ఈ సంఖ్యతో రైతుల వివరాల సేకరణ సులువుగా మారుతుంది. కేంద్ర, రాష్ట్ర పథకాల వర్తింపునకు దీన్ని ఆధారంగా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ సంఖ్య జారీకి రాష్ట్రస్థాయిలో సన్నాహాలు జరుగుతున్నాయి. మార్గదర్శకాలు రాగానే మేమూ ఇందులో భాగస్వాములవుతాం.

– ఎన్.విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ

## నేటి నుంచి అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

**దివాన్‌చెరువు(రాజానగరం):** దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈ నెల 7 నుంచి ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ 2024-25 పోటీలు నిర్వహించనున్నామని తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 9 వరకు జరుగుతాయన్నారు.

## 8న టీటీడీసీలో ఉద్యోగ మేళా

**సామర్లకోట:** ఈ నెల 8న సామర్లకోట టీటీడీసీలో ఉద్యోగ మేళాను సీడాప్‌తో కలిసి నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు తెలిపారు. బ్లూఓషన్ బయోటెక్, పేటీఎం, ఇన్నోవ్‌సోర్స్, జీపే కంపెనీ ప్రతినిధులు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, ఫిట్టర్, ఏదైనా డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు చేసుకుని 8న మేళాకు తగిన పత్రాలతో హాజరుకావాలన్నారు.

## బౌద్ధం జీవన మార్గం

**ఉండ్రాజవరం:** జీవన మార్గమైన బౌద్ధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బౌద్ధ పీఠాధిపతి అనాలయొ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బుద్ధిస్ట్ కౌన్సిల్ తృతీయ సర్వసభ్య సమావేశాన్ని అనాలయొ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలోని బుద్ధవిహార్‌లో ఆదివారం నిర్వహించారు. త్రిపిటకాలతో పాటు బౌద్ధ గ్రంథాలు సమకూర్చి ఉండ్రాజవరంలోని బౌద్ధ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వాటిని బౌద్ధులు, సావనీర్‌లు, బౌద్ధాభిమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉండ్రాజవరంలో నిర్మిస్తున్న బుద్ధవిహార్ రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంటుందన్నారు. ఉండ్రాజవరంలోని బుద్ధ వికాస కేంద్రం ద్వారా వందలాది మంది చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారన్నారు.

## ఆడబిడ్డకు ఎంత కష్టం వచ్చిందో..

### చెత్తకుప్పలో శిశువు మృతదేహం

**రాజమహేంద్రవరం నేరవార్తలు:** ఏ తల్లి కన్నదో.. పుట్టగానే చనిపోయిందో లేక బతికుండగానే తెచ్చి పడేస్తే ప్రాణాలు వదిలిందో తెలియదు.. అభంశుభం తెలియని నెలల శిశువు చెత్తకుప్పలో మృతదేహంగా కనిపించడం స్థానికులను కలచివేసింది. తుమ్మలోవ ప్రాంతంలోని జయరామ్ థియేటర్ సమీపంలో రోడ్డు పక్కన ఆదివారం ఉదయం చెత్తకుప్పలో ఈ దృశ్యం కనిపించింది. ఈగలు వాలుతూ ఓ మాంసం ముద్దలా ఉన్న ఆకారాన్ని కుక్కలు లాగబోతుంటే స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆడశిశువు మృతదేహంగా గుర్తించి ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. ఇంకా బొడ్డుతాడు కూడా తీయని శిశువు మృతి చెందితే అక్కడ పడేశారా.. ఆడబిడ్డ అని తెలిసి బతికుండగానే ఈ ఘాతుకానికి పాల్పడ్డారో విచారణలో తెలియాల్సి ఉందని రాజమహేంద్రవరం మూడో పట్టణ సీఐ వి.అప్పారావు తెలిపారు.

## భార్యాపిల్లల ముందే నరికేశాడు

### ఆస్తి వివాదంలో అన్న చేతిలో తమ్ముడి హత్య

**తాళ్లరేవు:** ఆస్తి వివాదం ఉన్మాదిలా మార్చేసింది. తోడబుట్టిన తమ్ముడినే కత్తితో కడతేర్చేలా చేసింది. తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ హత్యకు దారితీసింది. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంటపల్లి నూకరాజు ఇంటిదగ్గర కొబ్బరితోటలో ఆదివారం ఉదయం కొబ్బరి దింపుతుండగా అతడి అన్న ఏడుకొండలు అక్కడికి వెళ్లాడు. తోటలో తనకూ వాటా ఉందనడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. ఇంతలో ఏడుకొండలు కత్తితో నూకరాజుపై దాడిచేశాడు. అతడు కింద పడటంతో మరో నాలుగుచోట్ల నరకడంతో నూకరాజు(44) అక్కడికక్కడే మృతిచెందాడు.


మృతుడి భార్య, పిల్లలు


నూకరాజు (పాత చిత్రం)

కొబ్బరికాయలు దింపు తీసేందుకు వచ్చిన రెడ్డి రామకృష్ణపై సైతం దాడి చేసేందుకు ప్రయత్నించగా అతడు తప్పించుకున్నాడు. దీంతో అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య నాగరత్నం, తొమ్మిదేళ్ల కుమారుడు, అయిదేళ్ల కుమార్తె కళ్లెదుటే హత్య జరగడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. పోలీసులు వివరాలు సేకరించారు. ఇల్లు, కొబ్బరితోట వివాదం కోర్టులో ఉందని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

## రాకాసి అలలకు యువకుడు బలి


చంటి (పాత చిత్రం)

**తొండంగి, న్యూస్‌టుడే:** రాకాసి అలలకు ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్థులు, స్నేహితులు తెలిపిన వివరాలివీ.. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఉరుకుటి రాజు (24) గ్రామంలో టైలర్ వృత్తి చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. సోమవారం స్వామి మాల ధరించే నేపథ్యంలో ఆదివారం సముద్ర స్నానం చేయాలనుకుని తొండంగి మండలం అద్దరిపేట, వేమవరం సమీపంలోని సముద్ర తీరం వద్ద స్నేహితులతో స్నానం చేస్తున్నాడు. ఈ సమయంలో రాకాసి అలలు చంటిని సముద్రం లోపలకు లాక్కెళ్లాయి. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న స్నేహితులు అప్రమత్తమై బయటకు లాగారు. అప్పటికే ఉప్పు నీటిని తాగేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. స్నేహితులు ప్రైవేటు వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి తండ్రి గోవిందు, తల్లి రమణమ్మ ఉన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని దీంతో కేసు నమోదు చేయలేదని ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

## లారీ ఢీకొని దుర్మరణం


ఉప్మాక (పాత చిత్రం)

**తొండంగి, న్యూస్‌టుడే:** ఒంటిమామిడి - అన్నవరం ప్రధాన రహదారిలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. గొర్సపాలెం గ్రామానికి చెందిన నేమాల ఉప్మాక (50) ఆదివారం ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం పొలం వద్దకు గడ్డి కోసేందుకు వెళ్తున్నాడు. ఒంటిమామిడి పోలీసు స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి వెనుకే వస్తున్న లారీ (పరిశ్రమలకు నల్లరాయి తరలిస్తున్న లారీ) ఉప్మాక ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కొండమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

## జూదమాడుతూ దొరికిపోయిన ద్వారంపూడి అనుచరుడు

**మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే:** నిబంధనలకు విరుద్ధంగా జూదమాడుతున్నారని కొవ్వూరులోని ఓ క్లబ్‌పై ప్రత్యేక పోలీసులు ఈనెల 4న దాడిచేసిన ఘటనలో తప్పించుకునే యత్నంలో గోడదూకిన కాకినాడ నగర వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రధాన అనుచరుడు అంకాడి సత్తిబాబు తీవ్ర గాయాలపాలయ్యారు. అప్పటి నుంచి పలు మారుపేర్లతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో శనివారం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత అనుచరుడు కావడంతో ఇంటి పేరును తప్పుగా చెబుతూ కేసు నుంచి తప్పించాలని కొందరు తీవ్రంగా ప్రయత్నించారు. వైకాపా నాయకుడని, హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడని వాస్తవాలు వెలుగులోకి రావడంతో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పరామర్శించేందుకు ఆదివారం ఆస్పత్రికి వెళ్లారు. గతంలో కాకినాడ తేదేపా కార్యాలయంపై దాడి కేసులో సత్తిబాబు ప్రధాన నిందితుడని తేదేపా నాయకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఘటనపై కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు.

## ఇంజినీరింగ్ చదివి.. దొంగగా మారి..

### నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**గుంటూరు, న్యూస్‌టుడే:** ఇంజినీరింగ్ చదివిన ఒక యువకుడు దురలవాట్లకు బానిసయ్యాడు. ప్రయివేటు ఉద్యోగాలతో వచ్చే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగ అవతారమెత్తాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఇటీవల గుంటూరులో భారీ ఎత్తున బంగారు ఆభరణాలు అపహరించి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బావ ఇంట్లో దాచి పెట్టాడు. నిందితుడిని గుంటూరు పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొర్రెల చినబాబు 2015లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అప్పట్లో మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేశాడు. ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. క్రికెట్ బెట్టింగ్, గుర్రపు పందేలు, జూదానికి బానిసై డబ్బు సరిపోక 2019 నుంచి దొంగగా మారాడు. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడటంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇలా పలు స్టేషన్లలో 30 వరకు కేసులున్నాయి. జైలులో పరిచయమైన నాగ్‌పూర్‌కు చెందిన శామ్యూల్‌రాజుతో కలిసి గత నెల 21న గుంటూరులో ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. చోరీ సొత్తుతో పరారై కాకినాడ ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వరిస్తున్న బావ వినోద్ ఇంట్లో దాచి పెట్టినా సోదరి, బావకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా నిందితుడి ఆచూకీ కనుగొన్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. రూ.10 లక్షల విలువైన 306 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మరో దొంగ శామ్యూల్‌రాజును గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు.

**ధరవరలు**

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాళ్లు) | ధర (రూపాయల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి పెద్ది (వెయ్యికాయలు) | 11,500 |
| పాతకాయ పెద్ది | 17,500 |
| గండేర | 15,500 |
| కొత్తకాయ పెద్ది | 16,500 |
| గండేర | 14,500 |
| నీటికాయ (వెయ్యికాయలు) పాత | 14,000-15,000 |
| కొత్త | 13,500-14,000 |
| కొబ్బరినూనె 15 కిలోలు | 3,750 |
| | 260 |

| చికెన్ ధర (కిలో రూ.ల్లో) | |
|---|---|
| ఫారంకోడి | 120-00 |
| బ్రాయిలర్ లైవ్ | 142-00 |
| స్కిన్ | 206-00 |
| స్కిన్‌లెస్ | 234-00 |

# కాకినాడ

## రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)

**గాంధీనగర్:** టమాటా - 40, వంకాయలు - 40, 44, 56, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 28, 32, కాకరకాయ - 40, బీర - 46, కాలీఫ్లవర్ - 15, 20, క్యాబేజీ - 40, క్యారెట్ - 40, దొండకాయలు - 60, బంగాళాదుంపలు - 30, 34, ఉల్లి - 46, 50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 32, ఆనపకాయ - 25, 30, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 64, 110, చేమదుంపలు - 30, 40, మునగకాడలు - 10, 12, బీట్‌రూట్ - 36, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 84, బొబ్బర్లు - 46, చిలగడదుంపలు - 40, మామిడికాయ ఒకటి - 15, 18, నిమ్మకాయలు (డజన్) - 24, 60.

## నగరంలో సినిమాలు

**గాంధీనగర్:** ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్ - **దేవర పార్ట్ 1**, దక్షిణ, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్ - **దేవర పార్ట్ 1**, సత్యం సుందరం, కాళీ, లక్ష్మీ - **దేవర పార్ట్ 1**, సత్యగౌరి - బహిర్భూమి, తిరుమల - మన్మథ (ఉ.రా), కమిటీ కుర్రోళ్లు (మ.సా), సిఅండ్‌సీ 1 - మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2 – శ్వాగ్, శ్రీప్రియ - రామ్‌నగర్ బన్నీ, పద్మప్రియ - **దేవర పార్ట్ 1**, సూర్య 1 (వాకలపూడి) - **దేవర పార్ట్ 1**, సూర్య 2 - మిస్టర్ సెలబ్రిటీ, శ్రీశ్రీనివాసా (వేళంగి) - **దేవర పార్ట్ 1**.



## నేలకొరిగిన చెట్టు.. తప్పిన ప్రమాదం

నగరంలోని రవాణా శాఖ కార్యాలయం ప్రధాన రహదారిలో ఓ భారీ వృక్షం ఆదివారం ఉదయం నేలకొరిగింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. చెట్టు మొదల్లో కాలువ నీరు నిల్వ ఉండటం, కింద భాగంలో చెట్టు కుళ్లిపోవడంతో అకస్మాత్తుగా చెట్టు రోడ్డుపై కుప్పకూలిందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం వందల మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఆదివారం జన సంచారం తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

**- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్**

## దసరా ప్రయాణం.. జర భద్రం..!

న్యూస్‌టుడే:, సాంబమూర్తినగర్ (కాకినాడ),

దసరా పండగ వచ్చేస్తోంది.. పాఠశాలలకు సెలవులు ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లాలని ప్రయాణం పెట్టుకున్నవారితో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. కుటుంబ సమేతంగా బంధువుల ఇళ్లకు, విహార, ఆధ్యాత్మిక యాత్రలకు పలువురు బయలుదేరుతున్నారు. ఈ సమయంలోనే ప్రమాదాలకు, చోరీలకు ఆస్కారం ఉంటోంది. ఆనందంగా గడుపుతున్న వేళ ఊహించని విపత్కర పరిస్థితి ఎదురైతే విషాదం నెలకొంటుంది. ఇలాంటి సమయంలోనే అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ టౌన్ రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్), జీఆర్పీ అధికారులు ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలని, ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

### అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ అవగాహన



రైలు ఎక్కేవారిని క్యూలో నిలిపిన సిబ్బంది

#### గస్తీ నిర్వహిస్తూ..

దసరా పండగ రద్దీని పురస్కరించుకుని ఆర్పీఎఫ్ సీఐ వై. కొండయ్య నేతృత్వంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్, పోర్టు స్టేషన్ల వద్ద ముమ్మర గస్తీ ఏర్పాటుచేశారు. ప్లాట్‌ఫారాలపై ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వివరాలు ఆరా తీస్తున్నారు. పార్శిల్ కార్యాలయాలకు తీసుకువచ్చే ప్యాకెట్లు, సంచులను తనిఖీ చేస్తున్నారు. పలు రైళ్లలో ప్రయాణికుల బ్యాగులు, పెట్టెలు, సూట్‌కేసులు పరిశీలించి ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు వెంట తీసుకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు లేకుండా చూసుకోవాలని, లగేజీ బ్యాగులను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా వదిలేయకూడదని అవగాహన కల్పిస్తున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెంటనే రైల్వే రక్షణ దళం సిబ్బందికి సమాచారం అందించాలని కోరుతున్నారు. రైళ్లు, రైల్వే స్టేషన్లలో అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను ఎట్టి పరిస్థితుల్లోను తీసుకోవద్దని చెబుతున్నారు. కిరోసిన్, పెట్రోల్, వంటగ్యాస్, గ్యాస్‌స్టౌలు, టపాసులు, ఇతర పేలుడు పదార్థాలను రైళ్లలో తరలించవద్దని సూచించారు. రైళ్లు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఎక్కేవారు, దిగేవారిని ఓ కంట గమనిస్తూ ఉండాలని, రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో క్యూ పద్ధతి పాటించాలని ప్రచారం చేస్తున్నారు.

#### పూర్తి భద్రత..

రైలు ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. సిబ్బందితో ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నాం. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులకు దూరంగా ఉండాలి. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు ఏదైనా ఆపద ఎదురైతే వెంటనే గస్తీ సిబ్బందికి సమాచారం అందించాలి. రైలులో ప్రయాణిస్తున్నపుడు చిన్నపిల్లలు, వృద్ధులను నిర్లక్ష్యంగా వదిలేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.

**- వై.కొండయ్య, ఆర్పీఎఫ్ సీఐ**

## రేషన్ కార్డుల విభజనకు కసరత్తు



డీలర్ల సందేహాలు నమోదుచేస్తున్న ఉప తహసీల్దార్ ఆనంద్

**కాకినాడ కలెక్టరేట్:** రేషన్‌కార్డుల విభజనకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆదివారం అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దారు ఎంజేకే ఆనంద్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 116 చౌకదుకాణాలు ఉండగా 12 చోట్ల 1,200 కార్డులకు మించి ఉన్నాయని, 350 నుంచి 480 కార్డులున్న దుకాణాలు 40 ఉన్నాయని, అన్ని డిపోలకు సమానంగా కార్డుల విభజన చేయాలని డీలర్లు కోరారు. ఒక్కో డీలరు పరిధిలో కనీసం 750 నుంచి 800 కార్డులు లేకపోతే దుకాణాల అద్దె, నిర్వహణ భారంగా మారుతుందని, ఉన్నతాధికారులకు ఈ సమస్యను నివేదించాలని విజ్ఞప్తి చేశారు. తక్కువ కార్డులున్న దుకాణాలకు అదనంగా కార్డులు కేటాయించకపోతే మరింత నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉప తహసీల్దార్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం కార్డుల విభజన, కొత్త దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. 1,200 కార్డులకన్నా ఎక్కువ ఉన్న డీలర్లకు నోటీసులు ఇస్తున్నామని, వారంతా అభ్యంతరాలు, సందేహాలు తెలియజేయాలని కోరారు. మిగతా డీలర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఈనెల 8లోగా వీటిని అందించాలని సూచించారు.





కొండబాబుకు వినతిపత్రం అందిస్తున్న వాకర్లు

## వాకర్లను అనుమతించాలని ఎమ్మెల్యేకు వినతి

**మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే:** రంగరాయ వైద్య కళాశాల మైదానంలోకి వాకర్లను అనుమతించాలని కోరుతూ ఆర్ఎంసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. టూటౌన్, మెయిన్‌రోడ్డు, మసీదు సెంటర్, జగన్నాథపురం వంతెన మీదుగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వగృహం వరకు ర్యాలీ చేరుకుంది. అనంతరం వాకర్స్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. మైదానంలో జరిగిన దురదృష్టకర ఘటనతో మూసివేశారని, అప్పటి నుంచి వాకర్లు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. వాకర్లకు అనుమతినివ్వాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపల్, అధికారులతో మాట్లాడి అనుమతిచ్చేలా ప్రయత్నం చేస్తానన్నారు. అయితే మైదానంలో ఎలాంటి గొడవలు జరిగినా అసోసియేషన్ బాధ్యత వహించాలని సూచించారు.

## ఆకస్మిక బదిలీల ఆంతర్యమేమిటో..?

### మేనేజరు, అకౌంటెంట్ సీట్లు మార్పు

**కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** నగపాలక సంస్థలో ఇద్దరు అధికారుల ఆకస్మిక బదిలీ తీవ్ర చర్చనీయాంశమైంది. ఆరోపణల నేపథ్యంలో వీరిని బదిలీ చేశారని, కాదు.. బిల్లుల చెల్లింపు వ్యవహారంలో మాట వినకపోవడంతో చేశారని సమాచారం. నగరపాలక సంస్థ మేనేజరు కర్రి సత్యనారాయణను ఆ స్థానం నుంచి అకౌంటెంట్‌గా, అకౌంటెంట్ శిరీష్‌ను మేనేజరుగా పరస్పర బదిలీ చేస్తూ మున్సిపల్ కమిషనర్ భావన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు పోస్టులు సాధారణ పరిపాలన విభాగానికి చెందినవే. సూపరింటెండెట్ స్థాయి అధికారులను అంతర్గత బదిలీ చేస్తే అదే స్థాయి క్యాడర్‌లో నియమించాలి. కానీ ఇద్దరు అధికారులు ఒకేచోట పనిచేస్తుండగా, పరస్పరం సీట్లు మార్చడం ఏంటనే ప్రశ్న ఎదురవుతోంది.

### నిర్లక్ష్యమే కారణమా..

కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్లు దాఖలు చేయడం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, దస్త్రాలు తయారు చేయడంలో అకౌంటెంట్ శిరీష్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో కమిషనర్ ఆగ్రహానికి గురై బదిలీ చేశారనే వాదన ఉంది. సాధారణ ఎన్నికలకు సంబంధించి పరిశీలకులుగా వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు విడిది, ఇతర సౌకర్యాలకు సంబంధించిన బిల్లులు నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి చెల్లించేలా దస్త్రం తయారు చేయడంతో అకౌంటెంట్ ఆమోదం తెలపలేదని, ఎగ్జామినర్ కూడా కొర్రి వేశారని అంటున్నారు. ఈ బిల్లులు కలెక్టరేట్ నుంచి చెల్లించాల్సి ఉండగా, నగరపాలక సంస్థ సాధారణ నిధులు ఎలా వెచ్చిస్తారనే ప్రశ్నలు తలెత్తాయి. మొత్తం మీద నగరపాలక సంస్థ సాధారణ పరిపాలన విభాగంలో అంతర్గతంగా చోటుచేసుకున్న వ్యవహారం ఇద్దరు అధికారులు పరస్పర బదిలీకి కారణమయ్యిందని ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

### వైకాపా నేతలతో అంటకాగారా?

నగరపాలికలోని వివిధ విభాగాల్లోని అధికారులు గత వైకాపా పాలనతో ఆ పార్టీ నేతలతో అంటకాగారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికీ వారినే కీలక స్థానాల్లో కొనసాగిస్తున్నారనే భావన పలువురు వ్యక్తం చేస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ ఉద్యోగులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు నిర్వహిస్తే పాలన సక్రమంగా సాగుతుందనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది.



నృత్య రూపకంలో కళాకారులు

## ఆకట్టుకున్న పద్మావతి పరిణయం

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** సరస్వతి గానసభ 121వ దసరా సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి సూర్యకళా మందిరంలో ప్రదర్శించిన పద్మావతి పరిణయం నృత్య రూపకం కళాప్రియులను ఆకట్టుకుంది. బి.వి.ఆర్.శర్మ ఆధ్వర్యంలో 26 మంది కళాకారులు శ్రీనివాసుడిని పద్మావతి పరిణయమాడిన విధానం, ఆకట్టుకునే ఘట్టాలను నృత్యాలతో ప్రదర్శించారు. శ్రీనివాసుడు, పద్మావతి వేషధారణల్లోని కళాకారులు తమ హావభావాలతో మైమరపించారు. తొలుత కార్యక్రమాన్ని సరస్వతి గానసభ కార్యవర్గ సభ్యులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సరస్వతి గానసభ అధ్యక్షుడు కె.వి.ఎస్.ఆంజనేయమూర్తి, గౌరవాధ్యక్షులు పెద్దాడ సూర్యకుమారి, ఉపాధ్యక్షుడు లక్కరాజు సత్యనారాయణ్, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, చెరుకువాడ సత్యనారాయణ తదితరులతో పాటు నగరానికి చెందిన సంగీత విద్వాంసులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.



వీణాపాణిగా బాలాత్రిపురసుందరి



పాతబస్టాండ్ కనకదుర్గ ఆలయంలో..



వాసవి కన్యకాపరమేశ్వరిగా..



సంతచెరువు కనకదుర్గ ఆలయంలో..



దర్శనానికి వేచి ఉన్న భక్తజనం

## వీణాపాణి.. పాలయమాం

**గాంధీనగర్:** వీణాపాణిగా వీణపై సుస్వరాలు పలికిస్తూ.. జ్ఞానాన్ని ప్రసాదించే గాయత్రిదేవిగా దర్శనమిస్తూ.. రాజరాజేశ్వరిగా భక్తులకు అభయమిస్తూ.. లలితాత్రిపుర సుందరిదేవిగా కరుణిస్తూ.. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తజన నీరాజనాలు అందుకుంది. శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం అమ్మవారు విశేష పూజలందుకుంది. నగరంలోని సూర్యారావుపేట బాలాత్రిపురసుందరి ఆలయం భక్తజనంతో కిక్కిరిసింది. రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు వీణాపాణిగా దర్శనమిచ్చారు.

### నగరంలోని ఆలయాల్లో..

సంతచెరువు కనకదుర్గాదేవి ఆలయంలో మహిళలతో కుంకుమార్చనలు జరిగాయి. సాయంత్రం లలితాత్రిపురసుందరి అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంవీధిలోని పెద్దశివాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమివ్వగా భక్తులు భారీగా తరలివచ్చారు. భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపురసుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. అశోక్‌నగర్ షిర్డిసాయి మందిరంలో అన్నపూర్ణాదేవిగా, మధురానగర్ గోకులంలో గజలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ కనకదుర్గ ఆలయంతో పాటు పాతబస్టాండ్, సూర్యనారాయణపురం, అచ్యుతాపురం, గాంధీనగర్, బాలాజీచెరువు, వెంకట్‌నగర్, వార్ఫురోడ్డు, శ్రీరామ్‌నగర్, శారదాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

## ఆపదలో ఆదుకోవడమే మానవత్వం

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వమని శ్రీవెంకటభాస్కర ట్రస్టు అధ్యక్షుడు పులి రామలింగేశ్వరరావు అన్నారు. ఆదివారం మెయిన్‌రోడ్డులో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు తరఫున పెద్దాపురప్పాడుకు చెందిన క్యాన్సర్ రోగికి మందుల కొనుగోలు నిమిత్తం రూ.10 వేలు, గొట్టేటిపాలేనికి చెందినన మహిళకు చికిత్స, మందుల కొనుగోలుకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నక్కా అంజిబాబు, పత్తి సతీష్, డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జూద శిబిరంపై దాడి

**మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే:** జూద శిబిరంపై దాడిచేసి పలువురిపై ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ నాగదుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌వీధిలో జూదమాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. ఏడుగురుని అరెస్టుచేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.16,040 నగదు, ఏడు చరవాణులు, అయిదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

## ఆరోగ్య రక్షణపై శ్రద్ధ చూపండి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** సమాజ సంక్షేమం గురించి ప్రార్థించే వేద పండితులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ వైద్యుడు, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి డాక్టర్ ఐవీరావు కోరారు. భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యుత్‌నగర్ చల్లా ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు జి.వి.ఎస్.ఎన్.మూర్తి, సంఘం ప్రధాన కార్యదర్శి ముంజులూరి మాట్లాడారు. అనంతరం దసరా సందర్భంగా 73 మంది పేద బ్రాహ్మణులకు స్వయంపాకం నిమిత్తం రూ.1.70 లక్షల విలువైన బియ్యం, నిత్యావసరాలను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అయ్యగారి వెంకటేష్, కోశాధికారి రంగాభట్ల శ్రీనివాసు, జి.వి.కృష్ణప్రకాశ్, చల్లా శ్రీనివాస నిరంజన్, కిషోర్, మాండలిక శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న డాక్టర్ ఐవీరావు, సంఘం సభ్యులు

## మేమున్నాం.. మీకు తోడుగా

### చెత్త తరలించట్లేదు..

**సమస్య:** 41వ డివిజన్ గాంధీనగర్ యిమ్మిడి వారివీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఆ ప్రాంతంలో చెత్త పేరుకుపోయింది. సాయంత్రం దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

**- స్థానికులు, గాంధీనగర్**

**సమస్య:** రామారావుపేటలో కొంతమంది కాలువల్లో చెత్త వేస్తున్నారు. వర్షానికి మురుగు ముందుకు పారకుండా రోడ్లపైకి చేరుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.

**- రామకృష్ణ, ప్రైవేటు ఉద్యోగి, రామారావుపేట**

**సమాధానం:** సిబ్బందిని పంపి చెత్త తరలిస్తాం. కాలువల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

**- రాంబాబు, శానిటరీ సూపర్‌వైజర్, నగరపాలకసంస్థ**

### వెలగని వీధి దీపం

**సమస్య:** ప్రతాప్‌నగర్ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని బంగారువారు వీధిలో 64-10-14 డోరు నంబరు ఇంటి ఎదురుగా వీధి దీపం వెలగట్లేదు. రాత్రి సమయంలో సమస్యగా ఉంది.

**- స్థానికులు, ప్రతాప్‌నగర్**

**సమాధానం:** సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

**- సాంబశివరావు, ఏఈ, నగరపాలకసంస్థ**

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
**సాంబమూర్తినగర్: 91548 46719**



చిన్నారులు సేకరించిన వ్యర్థాలు

## చిన్నతనం నుంచే సేవాభావం

**సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే:** చిన్నతనం నుంచే సేవాభావాన్ని నేర్పించాలని హోప్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర కోరారు. 'గో గ్రీన్ - సేవ్ ఎర్త్' నినాదంతో ఎన్టీఆర్ బీచ్ తీరంలో రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్ చిన్నారులతో కలిసి ఆదివారం పర్యావరణ పరిరక్షణపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సాగరతీరంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించామని గివ్ ఏ లిటిల్ హోప్ అధ్యక్షుడు నాగేంద్ర కల్యాణ్ తెలిపారు. తీరానికి వచ్చే పర్యాటకులు ప్లాస్టిక్ కవర్లు, తాగునీటి ప్లాస్టిక్, గాజుసీసాలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త డబ్బాల్లోనే వేయాలని కోరారు. లయన్స్ క్లబ్ సహస్ర సభ్యులు, సంస్థ సభ్యులు ఈశ్వర్, వెంకట్‌ప్రసాద్, అరుణ్, చరణ్, సాయి, ఆనంద్, స్వరూప్, ప్రశాంత్, లిఖిల్, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

## జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



ఎమ్మెల్యే బుచ్చిబాబుతో ఉదయసాత్విక్

గొల్లప్రోలు: జిల్లా స్థాయిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కోరింగ మడ అడవిలో జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. కోనాల ఉదయసాత్విక్‌కు చిత్రలేఖనంలో ద్వితీయ బహుమతి, కోనాల అభినవ్‌కు వ్యాసరచన పోటీల్లో ప్రోత్సాహక బహుమతులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ అందజేశారు. విద్యార్థులకు గైడ్ టీచరుగా పిల్లి గోవిందరాజులు వ్యవహరించారు.

## కనకదుర్గమ్మకు బంగారు ఆభరణాలు



ఆలయ కమిటీ ఛైర్మన్ తాతాజీకి ఆభరణాలు అందిస్తున్న భక్తులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు కరణంగారితోటలోని కనకదుర్గమ్మకు రూ.1.55 లక్షల విలువైన రెండున్నర కాసుల బంగారు పుస్తెల తాడు, మంగళసూత్రాలను స్థానిక కొత్తపేటవీధికి చెందిన రామిశెట్టి కృష్ణార్జున, సత్య దంపతులు అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తాతాజీ, పిడకా సత్తిరాజు, కీర్తి వెంకటరమణ, నందిపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# నేస్తమా.. కుశలమా..

## 31 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు

పిఠాపురం: పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్(ఏకేపీఎం) పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1992-93లో పదో తరగతి పూర్తిచేసి, ప్రస్తుతం వివిధ హోదాలు, ఉద్యోగాల్లో ఉన్న వీరంతా 31 ఏళ్ల తరువాత ఇక్కడికి వచ్చారు. రోజంతా ఆనందంగా గడిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారంతా రావడం విశేషం.



పూర్వ విద్యార్థినుల బృంద చిత్రం

సామర్లకోట: పెద్దాపురం విటిగర్ గర్ల్స్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2007-2008లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో సందడి చేశారు. నాటి గురువులు అరుణశ్రీ, జాయిస్, యానాక్షి, ఇందిరా, విజయమేరీ, జాన్, రత్నకుమారి తదితరులను సత్కరించారు. ధనదుర్గ, భాగ్యవతి, వీరలక్ష్మి, శ్రీదేవి, సత్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై రైలు ప్రయాణికులకు అవగాహన

సామర్లకోట: సామర్లకోటలో రైల్వేస్టేషన్, రైలు బోగీలను పరిశుభ్రంగా ఉంచడంపై కరపత్రాలు పంచి ప్రయాణికులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా ఆదివారం స్వచ్ఛ రైలుబండ్లు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని ప్రయాణికులు వేచి ఉండే గదులను శుభ్రం చేశారు. వెయిల్, బొకారో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బోగీలను శుభ్రం చేశారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, టికెట్ చెకింగ్ సిబ్బంది, ఆర్పీఎఫ్, సఫాయి సిబ్బంది పాల్గొన్నారు.

# దారి తీరు.. జనం బేజారు

న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

కాకినాడ గ్రామీణంలోని వలసపాకల గ్రామంతోపాటు నగరపాలిక పరిధిలో ఉన్న రహదారికి 15 ఏళ్లుగా కనీస మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలసపాకల కూడలి నుంచి సుందరయ్యకాలనీ మీదుగా కాకినాడ అర్బన్ రెండో డివిజన్ ఎన్ఎఫ్‌సీఎల్ పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే దారిలో పెద్దపెద్ద గుంతలు పడి రాకపోకలు సాగించేందుకు భారీ వాహనదారులే ఇబ్బందులు పడుతున్నారంటే ఇక ద్విచక్ర, త్రిచక్ర, కార్లు, వ్యాన్ల చోదకుల ఇక్కట్లు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.




గుంతలు పడిన రహదారి

### పదిహేనేళ్లుగా ఇదే పరిస్థితి..

వలసపాకల ఎన్ఎఫ్‌సీఎల్ రహదారిని ప్రజలు, పారిశ్రామిక అవసరాల కోసం నిర్మించారు. 15 ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో గుంతల దారిలో రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలనీల నిర్మాణం పెరిగిపోవడంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా ఏర్పడడంతో భారీ వాహనాలతోపాటు కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల సమస్యలు తీర్చాలి. - మేడిశెట్టి వెంకటరమణ, సీఐటీయూ నాయకుడు

### పరిశీలించి ఇబ్బందులు తొలగిస్తాం

ఎన్ఎఫ్‌సీఎల్ పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే రహదారిని పరిశీలిస్తాం. ఈ దారి కొంత గ్రామీణంలో, మరి కొంత కాకినాడ నగరపాలిక పరిధిలో ఉంటుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - రమేష్, కాకినాడ నగరపాలక ఏఈ

## సేవలతోనే గుర్తింపు



నారాయణమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

కరప, కాజులూరు: విద్య, సామాజిక సేవా రంగంలో ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి సేవలు గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు సత్కరించారు. కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కరపకు చెందిన ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి 19 ఏళ్లుగా విద్యారంగంలో, తల్లి పేరుతో ఏటా వివిధ కార్యక్రమాలు, చేయూత సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తున్నారు. ఆయన సేవలు గుర్తించిన సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధుల చేతులమీదుగా విజయవాడలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త పోలిశెట్టి నారయ్య, మారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, కశిలంక సుబ్రహ్మణ్యం తదితరులు నారాయణమూర్తిని అభినందించారు.



పురుహూతిక అమ్మవారు




గాయత్రీదేవిగా..



దుర్గాడలో రుద్రాక్షధారిణి



భీమేశ్వరాలయంలో..



కాండ్రకోటలో త్రిపురసుందరి



గోకుల్‌గార్డెన్‌లో లలితాంబ

# అఖిల జగాలకు.. అమ్మవు నీవే

కరప, పిఠాపురం, పెదపూడి, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, సర్పవరం జంక్షన్: అంతటా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం కరపలోని శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని వీణాపాణిగా అలంకరించగా, పెద్దాపురప్పాడులో ఉమాపార్వతిని లలితాదేవిగా కొలువుదీర్చారు. వాకాడలో అన్నపూర్ణాదేవిని, యండమూరు, కొంగోడు, గొర్రిపూడి, కొరిపల్లి, గురజనాపల్లి, పెనుగుదురు, సిరిపురం వేళంగి తదితర గ్రామాల్లో అభిషేకాలు నిర్వహించారు. ● పాదగయ క్షేత్రంలో గాయత్రీదేవిగా అలంకరించారు. పురుహూతిక అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈవో విశ్వనాథరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాపర్తిలోని దుర్గామల్లేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. ● సంపర విజయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● తాటిపర్తిలోని అపర్ణాదేవిని కూష్మాండదేవిగా డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. దుర్గాడ శివాలయంలో లలితామాతను రుద్రాక్షలతో అలంకరించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద కనకదుర్గమ్మ లలితాదేవిగా దర్శనమిచ్చారు. కరణంగారి తోటలోని కనకదుర్గమ్మకు పూజలు చేశారు. ● సామర్లకోట భీమేశ్వరాలయంలో త్రిపుర సుందరి అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ● పెద్దాపురం పురపాలిక సెంటర్‌లోని దుర్గమ్మను పండ్లతో అలంకరించారు. సినిమా సెంటర్, వరహాలయ్యపేట, రామారావుపేట, కొండయ్యపేట, కుమ్మరవీధి, బంగారమ్మగుడి వీధి తదితరచోట్ల పూజలు నిర్వహించారు. మరిడమ్మను భవానీలు దర్శించుకున్నారు. భువనేశ్వరిపీఠంలో భక్తులు పూజలు చేశారు. ● రమణయ్యపేటలోని గోకుల్‌గార్డెన్‌లో కామాక్షి అమ్మవారికి, తూరంగి శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో లలితాత్రిపుర సుందరిగా అలంకరణలు చేశారు.



కరపలో వీణాపాణిగా..



సంపరలో..



తూరంగిలో త్రిపురసుందరి

## మేమున్నాం.. మీకు తోడుగా

### గుంత పూడింది

స్పందనకు పందనం



సమస్య: వలసపాకల-వాకలపూడికి ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి ఇబ్బందిగా ఉంది. - వాహనదారులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో గుంతను పూడ్పించి సిమెంటుతో మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెద్దాపురం: దివిలి విద్యుత్తు ఉపకేంద్రంలో వార్షిక మరమ్మతులతో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు. చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మర్లావ, తూర్పుపాకలు ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు

### వార్డు సభ్యులకు శిక్షణ..

కాజులూరు: గ్రామాభివృద్ధిపై పంచాయతీ వార్డు సభ్యులకు సోమ, మంగళవారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంబాబు తెలిపారు.

### విరామ బైబిల్ తరగతులు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని బేతేలు ఆరాధన మందిరంలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని పి.జె.తిమోతి ఆదివారం తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. ప్రజలు అర్జీలు ఇవ్వవచ్చన్నారు.

## 8న సర్వసభ్య సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీలలితకుమారి ఆదివారం తెలిపారు. ఎంపీపీ సత్యవతి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

## పర్యాటక కేంద్రాన్ని తీర్చిదిద్దండి

తాళ్లరేవు: మడ అడవులను, పర్యాటక కేంద్రాన్ని ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. కోరింగ అభయారణ్యం చొల్లంగి పర్యాటక కేంద్రంలో వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు సభ ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన ఆదివారం జరిగింది. పర్యాటక కేంద్రం ద్వారా ఆదాయం పెంచేందుకు అటవీ అధికారి వరప్రసాద్ కృషి చేశారని ప్రశంసించారు. 20 ఈడీసీ కమిటీల అభివృద్ధికి కేటాయించిన రూ.36లక్షల చెక్కును సభ్యులకు అందించారు. కట్టా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో ఉపాధ్యాయిని ప్రతిభ



తృతీయ స్థానం సాధించిన వీరలక్ష్మి

పెద్దాపురం: ఆంధ్రప్రదేశ్‌లో యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లయిన సందర్భంగా గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఇటీవల నిర్వహించారు. పెద్దాపురం శ్రీవీరేశలింగం పురపాలిక ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న డి.వీరలక్ష్మి 200 మీటర్ల పరుగులో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. పట్టణ యూటీఎఫ్‌శాఖ మహిళా అధ్యక్షురాలు బి.బేబీరత్నం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## గండ్లు.. ప్రయాణికులకు ఇక్కట్లు



పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గంలో ఇటీవల వరదలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. పొలాల్లోంచి వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో కోతకు గురయ్యాయి. దాంతో రోడ్లు ఎక్కడికక్కడే గుంతలతో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సామర్లకోట నుంచి పిఠాపురం వచ్చే రోడ్డు బాగా దెబ్బతింది. కోతకు గురై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ మార్గంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. పిఠాపురం నుంచి కొత్తూరు వెళ్లే రోడ్డు జములపల్లి, గోకివాడ మధ్య అనేక చోట్ల కోతకు గురైంది. రాత్రుళ్లు ఈ గుంతల్లో పడి ప్రజలు గాయాలపాలవుతున్నారు. రాపర్తి రోడ్డు, నాగులాపల్లి, రమణక్కపేట, గొల్లప్రోలు నుంచి మల్లవరం వెళ్లే రోడ్లు అధ్వానంగా మరాయి. అధికారులు స్పందించి కోతకుగురైన ప్రాంతాల వద్ద మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. దీని గురించి ర.భ.శాఖ ఏఈ ఆశ్రితను అడుగగా మరమ్మతులకోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

## రోగులతో గౌరవంగా మెలగాలి

తాళ్లరేవు: రోగులతో వైద్య సిబ్బంది గౌరవంతో మెలగాలని పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా అభివృద్ధికి సహకారం అందిస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవు సీహెచ్‌సీ అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాలపై సమీక్ష సమావేశం ఆసుపత్రి సూపరింటెండెంట్ స్నేహలత అధ్యక్షతన జరిగింది.. ఎమ్మెల్యే సమక్షంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, కూటమి శ్రేణులు పలు అంశాలపై ఆదివారం చర్చించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చోరీ యత్నంపై కేసు

సామర్లకోట: సామర్లకోటలోని సత్యనారాయణపురంలో తాళం వేసిఉన్న ఇంటిలో దుండగులు చోరీకి యత్నించారు. అడపా సత్తిరాజు నాలుగు రోజుల కిందట ఇంటికి తాళాలేసి హైదరాబాదులో ఉంటున్న కొడుకు ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం రాత్రి చోరీ యత్నం జరిగినట్లు గుర్తించిన పనిమనిషి సత్తిరాజుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణభగావాన్ తెలిపారు.

## రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సామర్లకోట: సామర్లకోట-కాకినాడ రోడ్డులో అయిదు తూముల వద్ద బైకును కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మాధవపట్నం గ్రామానికి చెందిన చింతపల్లి రాజు, గుత్తుర్తి సురేష్ సెల్‌ఫోన్ కొనేందుకు బైకుపై ఆదివారం పెద్దాపురం వెళ్తున్నారు. అయిదు తూములు సెంటర్ వద్ద ఎదురుగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

## తాగునీరు వృథా



జార్జిపేట పంచాయతీ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుంచి పెదపాటివారి వీధి వరకు జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో కొత్త పైపులైను వేసేందుకు పనులు చేశారు. ఆ క్రమంలో పాత కుళాయిల పైపులైన్‌ను ధ్వంసం చేయడంతో నాలుగు రోజులుగా తాగునీటి కొరత ఏర్పడిందని పెదపాటి కామేశ్వరరావు, కన్నీడి శ్రీను, పెదపాటి నాగు, పెదపాటి సత్తిబాబు, కొండయ్యలు ఆదివారం నిరసన తెలిపారు. దీనిపై జేఈ సుకీర్తనను వివరణ కోరగా పాత కుళాయిల పైపులైన్లు సరిచేసి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

## సంపద తయారీ కేంద్రం.. శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన



గొల్లప్రోలు: గొల్లప్రోలులోని మార్కెట్ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర స్థలంలో తుప్పలు తొలగించి శుభ్రపరిచే పనులను పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహించారు. ఈ నెల 4న 'ఈనాడు'లో 'స్వచ్ఛత.. సాగదీత!' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. సంపద తయారీ కేంద్ర ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరిచే పనులు చేపట్టారు. కేంద్రాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు సరఫరా చేసిన వాహనాలను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ అమలుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులను కోరినట్లు పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ ఆదివారం తెలిపారు.

# తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట


కరపత్రాలు పంపిణీలో స్టేషన్ మేనేజర్ రమేష్, సిబ్బంది

## బోగీల పరిశుభ్రతపై అవగాహన

**సామర్లకోట:** సామర్లకోటలో రైల్వేస్టేషన్, రైలు బోగీలు పరిశుభ్రంగా ఉంచడంపై కరపత్రాలు పంచి ప్రయాణికులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. ఆదివారం స్వచ్ఛ రైలుబండి కార్యక్రమాలు నిర్వహించారు. వెయిల్, జొకొలో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బోగీలను శుభ్రం చేశారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సత్యదేవుని రథ సేవ

**అన్నవరం, న్యూస్‌టుడే :** అన్నవరం సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేసి వైదిక బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ మూడు సార్లు ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు సత్యదేవుని సేవలో పాల్గొన్నారు.


రథసేవలో పాల్గొన్న దేవస్థానం అధికారులు

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఈనాడు స్పందన

**ఏలేశ్వరం:** పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందించామని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సత్యనారాయణ వెల్లడించారు. 'ఏలేశ్వరంలో ఎక్కడ చూసినా చెత్త' శీర్షికన 4 న ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రహదారి అంచులో చెత్త వేసేందుకు ఉంచిన డంపర్లను ఆదివారం శుభ్రం చేయించారు. సాగునీటి కాలువలను పరిశుభ్రం చేయించేందుకు జలవనరుల శాఖ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామన్నారు. సామాజిక పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని కమిషనర్ వెల్లడించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

### వ్యర్థాలు తొలగించారు..

**రౌతులపూడి, న్యూస్‌టుడే:** మండలంలోని మల్లంపేట గ్రామంలోని సామాజిక భవనం వీధిలో చెత్తతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. సమస్యను సర్పంచి పోలుపర్తి సీత, పంచాయతీ కార్యదర్శి నానాజీ వద్ద ప్రస్తావించగా వారు స్పందించారు. కార్మికులను పంపించి పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయించారు.

### మురుగుకాలువను బాగు చేశారు..

**తుని గ్రామీణం, న్యూస్‌టుడే:** కొన్నేళ్లుగా మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో సిబ్బందిలో మార్పు రావాలని నాయకుల ఫిర్యాదుతో కదలిక వచ్చింది. డి.పోలవరం బీసీ కాలనీలో మురుగు కాలువ పూర్తిగా మట్టితో నిండిపోయి ఉంది. దీంతో మురుగు, వర్షపునీరు రహదారిపై ప్రవహిస్తోంది. స్థానికుల ఫిర్యాదుతో పూడికతో నిండిన కాలువలో మట్టిని తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### కాలువలు శుభ్రం చేశారు

**శంఖవరం:** కత్తిపూడి పాతకొత్తూరులో మురుగు కదలక దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి వీరబాబు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

### రహదారులు వేయాలి

**తొండంగి, న్యూస్‌టుడే:** మండలంలోని పంపాదిపేట గ్రామంలో మురుగు కాలువలు, పూర్తి స్థాయిలో రహదారులు లేక గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పది రోజుల నుంచి వేసవిని తలపిస్తోంది. గ్రామంలో కాలువలు లేక మురుగు రహదారిపై నిల్వ ఉంటోంది. పంచాయతీ అధికారులు స్పందించి కాలువలు, రహదారులు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### కాలువలు శుభ్రం చేయరూ..!

**జగ్గంపేట గ్రామీణం:** కాట్రావులపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. డ్రైనేజీల్లో పూడికలు తొలగించకపోవడంతో కాలువలు నిండి దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్ కాలనీ, మెరకవీధిలో డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి నీరు పారడంలేదు. దీంతో దోమల బెడద ఎక్కువైంది. పంచాయతీ అధికారులు దృష్టిసారించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

## అనుగ్రహించమ్మా.. అన్నపూర్ణమ్మా..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు జగ్గంపేట దేవీ సెంటర్‌లోని దుర్గమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఏలేశ్వరం మూడు, 14 వార్డుల్లో ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. కొత్త యర్రవరంలో కనక దుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా చేస్తున్నారు. ● ప్రత్తిపాడు మండలంలోని ఏలూరు గ్రామంలో శ్రీనూకాలమ్మవారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బోనాలు శిరసు నెత్తుకుని భక్తులతో కలిసి ఈ వేడుకలో పాల్గొన్నారు. ● తుని పట్టణంలోని వెల్లవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ● శంఖవరం మండలం సీతంపేటలో కొండపై కొలువై ఉన్న దుర్గామాత అమ్మవారు ఆదివారం భక్తులకు లలితాత్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. ● అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు శారదాదేవి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ● జగపతినగరంలోని అభయదుర్గాదేవి అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా, కిర్లంపూడిలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ● తలుపులమ్మ అమ్మవారిని బాలత్రిపురసుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 5 వేలమంది పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానం సుమారు రూ.1.49 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, తుని, తుని గ్రామీణం, శంఖవరం, కిర్లంపూడి, అన్నవరం, గండేపల్లి (జగ్గంపేట) తుని పట్టణం.


ప్రత్తిపాడు: బోనాల సంబరంలో సత్యప్రభ


అన్నవరం: ప్రత్యేక అలంకరణలో వనదుర్గ అమ్మవారు


కొత్త యర్రవరంలో దుర్గాదేవి


శంఖవరం: లలితాత్రిపుర సుందరిదేవిగా..


తునిపట్టణం: రాజరాజేశ్వరీ అమ్మవారి అలంకరణలో..


జగపతినగరంలో అభయదుర్గాదేవి


జె.కొత్తూరులో లలితాంబికాదేవిగా..


జగ్గంపేట: అన్నపూర్ణాదేవిగా..

## ఇసుక మేటలు.. రైతుల అవస్థలు

**కిర్లంపూడి, న్యూస్‌టుడే:** ఏలేరు వరదల వల్ల రైతన్నలు అవస్థలు పడుతున్నారు. పంట భూముల్లో ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. రబీ పంట వేసుకునేందుకు ఇప్పటి నుంచే రైతులు సిద్ధమవుతున్నారు. ఇసుక మేటలు వేసిన భూముల్లో పంటలు వేసుకునేందుకు ఇప్పట్లో అనుకూలత కనిపించడంలేదు. పైగా కేవలం పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం అందగా ఇసుక మేటలతో భూములు పనికిరాకుండా పోయిన రైతులకు నేటికీ పరిహారం సంగతిని ప్రభుత్వం తేల్చలేదు. కిర్లంపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో చాలా ఎకరాల్లో భూముల్లో ఇసుక మేటలు వేశాయి. రైతుల భూముల్లో వేసిన మేటలను ఎంతో ఖర్చుచేసి బయటకు తోలి భూములను సరిచేసే పరిస్థితిలేక పంట భూములు ఇసుక తిన్నెలుగానే వదిలేశారు.


భూపాలపట్నంలో పంటపొలాల దుస్థితి

### పలుగ్రామాల్లో పరిస్థితి..

ఏలేరు వరదల కారణంగా కిర్లంపూడి మండలంలోని రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, బూరుగుపూడి తదితర గ్రామాల్లో పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. రాజుపాలెంలో గణేశుల రాంబాబు తదితర రైతులకు చెందిన సుమారు 10 ఎకరాల భూముల్లోకి భారీగా ఇసుక చేరింది. ముక్కొల్లు గ్రామంలో బస్వా శ్రీనివాసరావు తదితర రైతులకు చెందిన 15 ఎకరాల పైబడి భూముల్లో ఇసుక మేటలువేశాయి. భూపాలపట్నంలో వీరంరెడ్డి రామలింగేశ్వరరావు, ఇతర రైతుల పొలాల్లోనూ ఇదే పరిస్థితి. బూరుగుపూడి, సోమరాయణంపేట గ్రామాల్లోని భూముల్లోను పలుచోట్ల ఇసుక మేటలువేశాయి. ఈ భూములను తిరిగి సాగులోకి తెచ్చుకోవడానికి ఆయా రైతులకు భారంగా మారింది. ప్రభుత్వం దయతలచి వీటికి సంబంధించిన పరిహారం అందిస్తేగాని భూముల్లో వ్యర్థాలతోను తొలగించి పంటలు వేసుకునే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.


ముక్కొల్లులో పంటపొలాల్లోని ఇసుకను బస్తాల్లో నింపుతున్న స్థానికులు (పాత చిత్రం)

### నివేదికలు పంపాం..

పంటపొలాల్లో ఇసుక మేటలు వేసిన భూములను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ప్రభుత్వం పరిశీలించి బాధిత రైతులకు తగిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. త్వరలోనే దీనిపై తగిన నిర్ణయం తీసుకుని బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ఆర్డీఓ శ్రీరమణి

## నవంబరు 4న కోటి బిల్వార్చన

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు జాతీయ రహదారిని ఆనుకొని మినర్వా కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో నవంబరు 4న జరిగే అయ్యప్ప కోటి బిల్వార్చన, లక్షదీపోత్సవం ఏర్పాట్లు చురుగా సాగుతున్నాయి. ఈ విశిష్ట కార్యక్రమానికి సంబంధించి జిల్లా నలుమూలల విస్తృత ప్రచారం చేస్తున్నారు. పూజ నిర్వహించే ప్రదేశంలో నిర్వహణ కమిటీ ఆదివారం సమావేశం నిర్వహించింది. పూజా కార్యక్రమాలు, భక్తుల రద్దీ, భద్రత ఏర్పాట్లు ఇతరత్రా అంశాలపై చర్చించారు. తొలిసారి నిర్వహిస్తున్న కోటి బిల్వార్చనను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## కనులపండువగా స్వామివారి కల్యాణం

**తుని:** పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవస్థానంలో ఆదివారం ఉదయం హయగ్రీవ హోమం, సాయంత్రం స్వామివారి కల్యాణం కనుల పండువగా వేదపండితులు జరిపించారు. అనేక మంది భక్తులు పాల్గొని పూజలు ఆచరించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



డిపో ఎదుట నినాదాలు చేస్తున్న ఐకాస నాయకులు, కార్మికులు

## అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆందోళన

**ఏలేశ్వరం, న్యూస్‌టుడే:** ఏలేశ్వరం డిపో కండక్టర్ ఎస్.శ్రీనివాసరావుపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని కార్మిక ఐకాస ప్రారంభించిన ఆందోళనలు తీవ్రతరమవుతున్నాయి. నేషనల్ మజ్దూర్, ఎంప్లాయీస్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్లు ఐకాసగా ఏర్పడి ఉద్యమిస్తున్నాయి. డిపో మెయిన్ గేట్ వద్ద ఎర్ర బ్యాడ్జీలను ధరించి ఆదివారం ధర్నా చేశారు. సమస్య పరిష్కారం కోరుతూ చేస్తున్న రిలే దీక్షల్లో కె.అప్పలరాజు, టీఎన్‌వీ రాజేందర్, కె.నూకరాజు కూర్చున్నారు. నాయకులు ఎన్‌వీ రావు, కె.త్రిమూర్తులు, ఎల్వీఎస్ నారాయణ, చలం తదితరులు మాట్లాడుతూ ఏపీ ప్రజా రవాణా శాఖ ఆదేశాలను ఖాతరు చేయకుండా స్థానిక డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఈ తరహాలోనే కండక్టర్ ఎస్ఎస్‌రావుని విధులకు దూరం చేశారన్నారు. ఇకనైనా సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ తన కార్యకర్తలతో వచ్చి కార్మికులకు సంఘీభావం తెలిపారు.

## నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

**గండేపల్లి (జగ్గంపేట),న్యూస్‌టుడే:** నేడు జగ్గంపేటలో దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 8 గంటల నుంచి జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎమ్మెల్యే నెహ్రూ, కూటమి నాయకులు నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఈ ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు అప్పలరాజు, భద్రం, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు అప్పన్నదొర తదితరులు ఉన్నారు.

## అనుమతులు లేకుండా బాణసంచా తయారుచేయొద్దు

**గండేపల్లి (జగ్గంపేట),న్యూస్‌టుడే:** అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జగ్గంపేట శివారున ఉన్న కొప్పన వీర్రాజు, గండేపల్లి శివారు పుష్కరకాలువ గట్టుపక్కన ఉన్న పాంటు బాణాసంచా తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇళ్లమధ్యలో బాణసంచా తయారుచేసిన, నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎస్సై రఘునాధరావు, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, అగ్నిమాపక సిబ్బంది


టి.రాయవరం సమీపంలో బెల్లంఊట పారబోస్తున్న ఎస్సై లక్ష్మీకాంతం

## బెల్లం ఊట ధ్వంసం

**ప్రత్తిపాడు:** టి.రాయవరం గ్రామ శివారున సారా తయారీ స్థావరంపై ఎస్సై లక్ష్మీకాంతం, సిబ్బంది ఆదివారం దాడులు చేశారు. సారా తయారీకి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామం నుంచి అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని, నిందితులు పరారయ్యారని వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై చెప్పారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగానే ఉంచుతామన్నారు.

## రోడ్డును కప్పేస్తున్నా పట్టదా..!

**న్యూస్‌టుడే– జగ్గంపేట గ్రామీణం:** ప్రమాదకర మలుపులు, రోడ్డును కప్పేస్తున్న చెట్లు తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డుపైకి వచ్చే చెట్లను, కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యల్లేవు. రింగురోడ్డుగా పిలువబడే గుర్రంపాలెం-సోమవరం రోడ్డుపై చెట్లు సగం మేర ఆక్రమించి ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో వాహనాల రద్దీ పెద్దగా లేకున్నా, విశాలమైన రోడ్డు ఉన్నా రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గొల్లలగుంట, కాండ్రేగుల మధ్యలో ముళ్ల చెట్లు రోడ్డును ఆక్రమించడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వాహనం వచ్చే సమయంలో తప్పించేందుకు ముళ్లపొదల్లోకి వెళ్లి గాయపడుతున్నారు. కాండ్రేగుల శివారు వెదురు చెట్లు రోడ్డుమీదకు వచ్చి వాహనదారుల కళ్లకు కొడుతుంది. ఈ రోడ్డుపై మలుపుల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు సైతం కనిపించకుండా తుప్పలు ఆక్రమించేస్తున్నా అధికారుల్లో కనువిప్పు కలగడంలేదు. ఇక గ్రామీణ రోడ్లయితే రెండువైపులా ఆక్రమించి వాహనాలు తప్పించే పరిస్థితి లేదు. మన్యవారిపాలెం-కృష్ణాపురం మధ్యలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పేరుకుపోవడంతో రోడ్డు బక్కచిక్కిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగ్గంపేట- కాట్రావులపల్లి మధ్య రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపైకి వస్తున్న తుప్పలను తొలగించే చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కాండ్రేగులలో రోడ్డును సగం వరకు ఆక్రమించిన వెదురు చెట్లు


గుర్రంపాలెంలో ర.భ అధికారులు అమర్చిన హెచ్చరిక బోర్డు కనిపించని వైనం

### చర్యలు చేపడతాం

మండల పరిధిలో ర.భ. రోడ్లకు ఇరువైపులా పెరిగిన మొక్కలు, ముళ్ల చెట్ల తొలగింపు చర్యలు చేపడతాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- వర్మ, ఏఈ, ర.భ.

## చక్రాల కుర్చీలు అందజేత



వీల్ ఛైరు అందజేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

**తుని, న్యూస్‌టుడే:** రోటరీ క్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులకు ఆదివారం వీల్ ఛైర్లు పంపిణీ చేశారు. పట్టణంలోని లయోలా స్కూలు ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి క్లబ్ ప్రతినిధులు వీటిని వైకల్యం ఉన్నవారికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెక్కా శ్రీధర్, కార్యదర్శి దండెం కృష్ణ, కోశాధికారి మురళీ, దొరబాబు, బుజ్జీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**తుని గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని ఎస్.అన్నవరం గ్రామ పరిధిలోని ద్వారక నగర్‌లో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం రాత్రి గుర్తించినట్లు రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని మృతదేహాన్ని గుర్తించే పరిస్థితి లేదని తెలిపారు. మృతుడు నల్ల ప్యాంట్, నల్ల షర్టు ధరించినట్లు గుర్తించామన్నారు.


సహచరులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

## ఏలేశ్వరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ఏలేశ్వరం:** ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94లో 'పది' చదువుకున్న వారు ఆదివారం కలుసుకున్నారు. తమతో చదువుకుని సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నాటి మిత్రులను సన్మానించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తూమురౌతు శ్రీనివాసరావు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులైన వాగు రాజేష్‌ను సహచరులు ఘనంగా సత్కరించారు. పైల సుభాష్‌చంద్రబోస్, గోగుల మూర్తి, శంఖాని పెంటారావు, శిడగం రాంబాబు, రాతికింద సతీష్ తదితరులు మాట్లాడుతూ మిత్రుల సహకారంతో ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఇంకెన్నాళ్లీ అలంకారప్రాయంగా ట్యాంకు..?

**జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని వెంగాయమ్మపురంలో ర.భ. రోడ్డును అనుకుని రూ.వేలు వెచ్చించి ఏర్పాటుచేసిన మంచి నీటి ట్యాంకు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. సమీప కాలనీలో తాగు నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని గతంలో ట్యాంకును ఏర్పాటుచేసి నీటి సరఫరా చేసేవారు. ట్యాంకులో నీటి సరఫరాకు ఇదే ప్రదేశంలో ఉన్న బోరును అనుసంధానం చేశారు. గత కొంతకాలంగా నీటిసరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. సంబంధిత అధికారులు దృష్టిసారించి ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వెంగాయమ్మపురంలో ట్యాంకు

## 'చెత్త'గించాలి.. సంపద చూపాలి

న్యూస్‌టుడే–ప్రత్తిపాడు

చెత్త నుంచి సంపద తయారీకి వైకాపా పాలనలో దృష్టిసారించలేదు. కేంద్రం అందించిన ఊతంతోనూ స్వచ్ఛ సంకల్పం నెరవేరలేదు. అక్కడక్కడ ఈ కేంద్రాలు నడుస్తున్నా పలుచోట్ల కట్టినవి వినియోగంలోకి రాని పరిస్థితి. నిధులు సవ్యంగా ఇవ్వక నిర్వహణ భారం అయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నేరుగా నిధులు వస్తున్నాయి. ఊళ్లలో ఉత్పత్తయ్యే వ్యర్థానికి 'అర్థం' ఉండాలని ప్రతి పల్లె కోరుకుంటోంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ పంచాయతీకి ఒక సంపద సృష్టి కేంద్రం ఉండాలి. 67 పంచాయతీల్లోనూ 24 చోట్ల సంపద కేంద్రాల ఊసే లేదు. రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించిన వాటిని వినియోగంలోకి తేవాల్సి ఉంది. గత పాలనలో పంచాయతీలు హరిత రాయబారులకు జీతాలు ఇవ్వలేకపోవడం గమనార్హం.


ప్రత్తిపాడు లంపకలోవ దారిలో చెత్త కొండ


చింతలూరులో నిరుపయోగంగా వ్యర్థాల నిర్వహణ కేంద్రం

### హైవేనూ వదల్లేదు..

చెత్తను ఊరి చివర పోగేయడం రివాజుగా మారింది. జాతీయ రహదారిని వదల్లేదు. గండేపల్లి నుంచి తుని వరకూ హైవే వెంబడి ఉన్న గ్రామాల్లో 15చోట్ల వ్యర్థాలు గుట్టలుగా ఉన్నాయి. మెట్టలోని 60 చెరువులు చెత్తతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సంపద సృష్టి అటుంచి నీటి వనరులకు చేటు చేస్తున్నాయి. ఇందుకు ఉదాహరణలివీ.. ప్రత్తిపాడులోని చెరువులు డంపింగ్ యార్డులుగా మారాయి. లంపకలోవ దారిలో వ్యర్థాల కొండ కంపు కొడుతోంది. శరభరంలో నిర్మించిన సంపద తయారీ కేంద్రం జూదాలకు వేదికగా మారింది. కత్తిపూడిలో కేంద్రం ఉన్నా హైవే వెంబడి చెత్త పోగేస్తున్నారు. వజ్రకూటం, వేళంగి, పెదమల్లాపురం, మండపం, కొంతంగి, చింతలూరు గ్రామాల్లో వినియోగంలో లేవు..

### వీటిని వినియోగంలోకి..

స్వచ్ఛ సంకల్పంతో ప్రతి పంచాయతీకి చెత్త సేకరణకు ఏడాదిన్నర కిందట తొట్టి రిక్షాలను సమకూర్చారు. ఒక్కో రిక్షాను రూ.25వేలు వెచ్చించారు. నాలుగు మండలాల్లోనూ 100కిపైగా రిక్షాలను సరఫరా చేశారు. వాడకంలో ఉన్నవి 60 శాతానికి మించవు. వాడకుండా వదిలేసిన వాటిని, . చెడిపోతే మరమ్మతులు చేయని వాహనాలను వినియోగంలోకి తేవాల్సి ఉంది.

### ప్రత్యేక దృష్టి పెట్టాం

గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నిర్మించి వదిలేసిన వాటిని వినియోగంలోకి తెస్తాం.. చెరువులు, రహదారులను డంపింగ్ యార్డులుగా వాడకూడదని ఇప్పటికే పంచాయతీలకు ఆదేశాలిచ్చాం.

- కుమార్‌బాబు, ఎంపీడీవో


పరీక్షరాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

## టెట్ పరీక్షకు 371 మంది హాజరు

**గండేపల్లి:** సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన ఏపీటెట్ ఆన్‌లైన్ పరీక్షకు 371 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రో-ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 220 మంది అభ్యర్థులకుగానూ 186 మంది, మధ్యాహ్నం 224 మంది అభ్యర్థులకు 185 మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం కలిపి 73 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

## పారుపాకలో అన్నదానం

**రౌతులపూడి:** పారుపాక గ్రామంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామపెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.